క్లుప్తంగా

జగ్గారెడ్డిని కలిసిన నీలం మధు



జగ్గారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: ఈ నెల 15న కాంగ్రెస్‌లో చేరనున్న ఎస్‌ఎమ్‌ఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ మెదక్ పార్లమెంటు పరిధిలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా ప్రసాద్ చౌహాన్



ప్రసాద్‌చౌహాన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

సంగారెడ్డి: జిల్లా కేంద్రం సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా ప్రసాద్‌చౌహాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆర్మూర్‌లో పనిచేసిన ప్రసాద్‌చౌహాన్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు మున్సిపల్ డీఈ ఇంతియాజ్ అహమ్మద్, ఆర్‌వో విజయలక్ష్మి, ఆర్‌ఐ సూర్యప్రకాష్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికులకు అడ్డా స్థలం కేటాయించండి

జహీరాబాద్ టౌన్: భవన నిర్మాణ కార్మికులకు అడ్డా కోసం స్థలం కేటాయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు భవన నిర్మాణ కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని భవన నిర్మాణ కార్మికులకు అడ్డా స్థలం లేకపోవడంతో రోడ్డు పక్కన వేచి ఉంటున్నారన్నారు. 1996 చట్టం ప్రకారం కార్మికుల కోసం అడ్డాతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి కార్మికులకు అడ్డా స్థలం కేటాయించి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ నెల 16న నిర్వహించనున్న సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ భవన నిర్మాణ కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి బక్కన్న నాయకులు యోహాను, తుల్జారాం పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

జహీరాబాద్ టౌన్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన జేఈఈ మెయిన్స్ తొలి విడుత ఉమ్మడి ప్రవేశ పరీక్షల్లో అల్గోల్ మైనార్టీ బాలుర గురుకులానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రవీణ్ కుమార్, జశ్వంత్ అర్హత సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జమీల్, పాఠశాల ప్రిన్సిపాల్ రాములు విద్యార్థులను ఘనంగా సన్మానించి బహుమతులను ప్రదానం చేశారు. కోఆర్డినేటర్ నాగార్జున, అధ్యాపకులు ఇబ్రహీం, అజ్రఅంజుమ్, భవానీ, శ్రీనివాస్, నసీర్, సిద్దప్ప పాల్గొన్నారు.

19 మంది విద్యార్థుల ఉత్తీర్ణత..

హత్నూర (సంగారెడ్డి): జేఈఈ మెయిన్స్‌లో హత్నూర గురుకుల కళాశాలకు చెందిన 19 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వివేకానంద తెలిపారు. కళాశాలకు చెందిన 60 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్షలు రాయగా 19 మంది మొదటి సెషన్లో ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఈకేవైసీకి నెలాఖరు గడువు

- సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు అధికారుల సూచన
- 85 శాతం రేషన్ ఈకేవైసీ ప్రక్రియ పూర్తి

జహీరాబాద్ టౌన్: రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా అర్హులైనవారికే అందించాలన్న ఉద్దేశంతో రేషన్ కార్డుల ఈకేవైసీ ప్రక్రియను చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని గతేడాది సెప్టెంబర్‌లో ప్రారంభించగా జనవరి 31 వరకు గడువును విధించారు. కాగా పలు కారణాలతో రేషన్ ఈకేవైసీ ప్రక్రియకు ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువును పొడిగించింది. ఆహార భద్రత కార్డు(తెల్ల రేషన్‌కార్డు)లో సభ్యులు ఉన్నారో.. లేరో అని తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈకేవైసీ ప్రక్రియను ప్రవేశపెట్టింది. కార్డులో పేరున్న వారంతా రేషన్ దుకాణాల్లో బయోమెట్రిక్‌తో ఈకేవీసీ(నో యువర్ కస్టమర్) చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఐదు నెలల క్రితం ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఈకేవీసీ చేసుకోకుంటే బియ్యం రావనే వదంతులతో లబ్ధిదారులు ప్రారంభంలో దుకాణాలకు పరుగులు తీశారు. కొంతమంది ఆధార్ అప్‌డేట్ కాకపోవడంతో అవస్థలు పడ్డారు.

గడువులోపు పూర్తి చేసుకుంటే మంచిది

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలను భరిస్తూ ఒక్కొక్కరికి 6 కిలోలు, అంత్యోదయ కార్డు ఉన్నవారికి 35 కిలోల చొప్పున రేషన్ బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తోంది. 2014 డేటా ప్రకారం రాష్ట్రంలో రేషన్ అందిస్తోంది. గడిచిన పదేళ్లలో చాలామంది చనిపోయారు. కొంతమంది అమ్మాయిలు పెళ్లిళ్లు చేసుకొని వెళ్లిపోయారు. కొంతమంది కొత్తకాపురాలు పెట్టారు. ఇన్ని మార్పులు జరిగినప్పటికీ రేషన్ పంపిణీ జరుగుతోంది. దీంతో అవకతవకలు జరుగుతున్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే అసలైన లబ్దిదారులను గుర్తించేందుకు ఈకేవైసీ ప్రక్రియను ప్రారంభించింది. ఒకవేళ ఈకేవైసీ చేయకపోతే రేషన్‌కార్డులో పేరు తొలగించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని, మళ్లీ పేరు చేర్చడం అన్నది అసాధ్యం కాకాపోయినా అదో పెద్ద ప్రయాస. దీని కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం తప్పదు. రేషన్ బియ్యం రాకపోవడమే కాకుండా ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించే విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, దీంతో గడువులోగా ఈకేవీసీ పూర్తి చేయించుకోడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు.



ఈకేవైసీ నమోదు చేయించుకుంటున్న లబ్ధిదారుడు

జహీరాబాద్‌లో 33 వేల కార్డులు

జహీరాబాద్‌లో 56 రేషన్ దుకాణాలు ఉన్నాయి. మున్సిపల్ పరిధిలో 34, గ్రామాల్లో 22 దుకాణాలు ఉన్నాయి. ఆహార భద్రత, అంత్యోదయ కార్డులు కలిపి 33,880 కార్డులు ఉన్నాయి. వీరిలో ఇప్పటివరకు 85శాతం వరకు ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. మిగిలిన వారి కోసం నిర్వాహకులు ఉదయం, సాయంత్రం దుకాణాల వద్ద అందుబాటులో ఉంటూ ఈకై వేసీ చేస్తున్నారు. బయోమెట్రిక్‌లో సమస్య తలెత్తితే ఐరిష్ విధానాన్ని అనుసరిస్తున్నారు. బయోమెట్రిక్, ఐరిష్ విధానంలో ఈకేవీసీ నమోదు కాకపోతే లబ్దిదారులు మీ–సేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించడంతో ఈ అవకాశాన్ని రేషన్ లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

యువత పెడదోవ పట్టొద్దు

- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి
- ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి

నారాయణఖేడ్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎంపీ, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు సురేష్‌షెట్కార్ అన్నారు. బంజారా సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగల్‌పేట్‌లోని దుర్గాభవానీ మాత ఆలయం నుంచి సేవాలాల్ చౌక్, బసవేశ్వర చౌక్, రాజీవ్‌చౌక్ మీదుగా తహసీల్ గ్రౌండ్ వరకు బోనాలతో ప్రదర్శన నిర్వహించారు. అదేవిధంగా తహసీల్ గ్రౌండ్‌లో భోగ్ భండార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్, అఖిల భారత సాధు సంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్, ఇరక్‌పల్లి పీఠాధిపతి దేవీదాస్ మహారాజ్, సంఘ స్థానిక బాధ్యులు రాజునాయక్, రవీందర్‌నాయక్, రాంచందర్, కిషనాయక్ రాథోడ్, గోవింద్‌నాయక్, గిరిజన పెద్దలు జీవులానాయక్, నెహ్రూనాయక్, వెంకట్‌నాయక్, రఘునాథ్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని బంజారా సేవాలాల్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్ ఆధ్వర్యంలో ఖేడ్ తహసీల్ గ్రౌండ్‌లో ఈ నెల 7న ప్రారంభమైన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ బుధవారంతో ముగిసింది. టోర్నీలో 20 జట్లు పాల్గొనగా బంజారా లెవన్ టీం విన్నర్‌గా నిలిచి రూ.25 వేలు, రన్నర్‌గా నిలిచిన రుద్రారం జట్టుకు రూ.12వేల నగదు, బహుమతులను బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్ చేతుల మీదుగా ప్రదానం చేశారు.

ఎంపీడీఓలుగా బాధ్యతల స్వీకరణ

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఎంపీడీఓగా మహేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఎంపీడీఓగా ఉన్న సుమతి బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో నల్గొండ జిల్లా తప్పర్తి మండల ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి జహీరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డిని కార్యాలయం అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

కోహీర్ ఎంపీడీఓగా భారతి

కోహీర్(జహీరాబాద్): కోహీర్ ఎంపీడీఓగా భారతి బాధ్యతలు చేపట్టారు. ఆమె శివంపేట మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా భారతిని పలువురు నాయకులు, వివిధ శాఖల అధికారులు ఘనంగా సన్మానించించారు. కోహీర్‌లో ఎంపీడీఓగా పనిచేసిన సుజాతనాయక్ బదిలీపై రంగారెడ్డి జిల్లాకు వెళ్లారు.

హత్నూర ఎంపీడీఓగా శంకర్

హత్నూర(సంగారెడ్డి): హత్నూర ఎంపీడీవోగా శంకర్ బాధ్యతలను చేపట్టారు. ఇప్పటివరకు ఎంపీడీఓగా పనిచేసిన శారదాదేవి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శంకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కొండాపూర్ ఎంపీడీఓగా జ్యోతిలక్ష్మి

కొండాపూర్(సంగారెడ్డి): కొండాపూర్ ఎంపీడీఓ మధులత నల్గొండ జిల్లాకు బదిలీపై వెళ్లగా నల్గొండ జిల్లాలో ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న జ్యోతిలక్ష్మి కొండాపూర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

పుల్‌కల్ ఎంపీడీఓగా ఆనంద్ మేరీ

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ ఎంపీడీఓగా ఆనంద్ మేరీ బాధ్యతలు స్వీకరించారు. పుల్‌కల్ ఎంపీడీఓ జయలక్ష్మి బదిలీ కావడంతో ఆమె స్థానంలో నార్సింగ్ ఎంపీడీఓ ఆనంద్ మేరీ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వంద శాతం పారిశుద్ధ్యం పాటించాలని సూచించారు.

సంగారెడ్డి ఎంపీడీఓగా యాదగిరి

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి ఎంపీడీఓగా యాదగిరిరెడ్డి బాధ్యతలను చేపట్టారు. ఇప్పటివరకు ఎంపీడీఓగా పనిచేసిన రవీందర్ బదిలీపై వెళ్లారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

కంది ఎంపీడీఓగా శ్రీనివాస్

కంది(సంగారెడ్డి): కంది మండల అభివృద్ధి అధికారిగా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. మెదక్ జిల్లా కొడిపల్లి మండలం నుంచి కంది మండలానికి బదిలీపై వచ్చిన శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన విశ్వప్రసాద్ వికారాబాద్ జిల్లా తాండూరు మండలానికి బదిలీపై వెళ్లారు.

ఎంపీడీఓకు సన్మానం

రాయికోడ్(అందోల్): మిర్యాలగూడ నుంచి బదిలీపై వచ్చి రాయికోడ్ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన మసూద్ షరీఫ్‌ను ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహించిన వెంకటేశం నల్గొండ జిల్లాకు బదిలీ అయ్యారు.

గుమ్మడిదల ఎంపీడీఓగా ఉమాదేవి

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల ఎంపీడీఓగా ఉమాదేవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఉమాదేవిని ఘనంగా సన్మానించారు.

మనూరు ఎంపీడీఓగా అలివేలు మంగమ్మ

మనూరు(నారాయణఖేడ్) మనూరు మండల ఎంపీడీఓగా అలివేలు మంగమ్మ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు మనూరు ఎంపీడీఓగా పనిచేసిన షాజిలోద్దీన్ మెదక్ జిల్లా రామాయంపేటకు బదిలీ అయ్యారు. నల్లగొండ జిల్లాలో పనిచేసిన అలివేలు మంగమ్మ ఎంపీడీఓగా బాధ్యతలను స్వీకరించారు.

అందోలు ఎంపీడీఓగా రాజేష్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

జోగిపేట(అందోల్): అందోలు ఎంపీడీఓగా రాజేష్‌కుమార్ బాధ్యతలను చేపట్టారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయనను అందోలు మండలానికి బదిలీ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్‌ను వివిధ గ్రామాల కార్యదర్శులు శాలువాతో సన్మానించారు.

సిర్గాపూర్ ఎంపీడీఓగా మల్లూర్

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఎంపీడీఓగా మల్లూర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన సుజాత నల్గొండ జిల్లాకు బదిలీపై వెళ్లారు. దీంతో సూర్యపేట జిల్లా ఆత్మకూర్ మండలంలో పనిచేస్తున్న మల్లూర్‌ను సిర్గాపూర్ ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓను ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

అమీన్‌పూర్ ఎంపీడీఓగా శ్రీనివాస్

పటాన్‌చెరు: అమీన్‌పూర్ ఎంపీడీఓగా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ చలమేశ్వర్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సిబ్బంది శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.

న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటా

- రెవెన్యూ అధికారుల తీరుపై బాధిత మహిళ ఆగ్రహం
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయింపు

హత్నూర(సంగారెడ్డి): క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండా ఏకపక్షంగా పౌతి మార్పు చేశారని ఆరోపిస్తూ ఓ మహిళ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం సాయంత్రం ఆందోళనకు దిగింది. అధికారులు స్పందించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని తేల్చి చెప్పింది. వివరాల్లోకి వెళ్తే... రంగారెడ్డి జిల్లా నిజాంపేట పట్టణానికి చెందిన గండని మాణిక్యంకు పెంటమ్మ, బుజ్జి ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య పెంటమ్మకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉండగా రెండో భార్య బుజ్జికి కుమారుడు, కూతురు ఉన్నారు. అయితే కొన్నేళ్ల క్రితం పెంటమ్మ మృతి చెందగా 24 నవంబర్ 2018లో మాణిక్యం మృతి చెందాడు. మొదటి భార్య ఇద్దరి కూతుల్ల వివాహం అనంతరం మొదటి భార్య కుమారుడు కూడా మృతి చెందాడు. అయితే మాణిక్యం రెండో భార్య బుజ్జి తన ఇద్దరు పిల్లలతో నిజాంపేట్‌లో ఉంటూ పారిశుద్ధ్య కార్మికురాలుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. అయితే మాణిక్యం మీద ఉన్న స్థిరాస్తుల పంపకాల్లో కొంతకాలంగా మొదటి భార్య ఇద్దరు కుతుర్లతో పాటు రెండో భార్యకు మధ్య సఖ్యత లేక భూమి పౌతి మార్పునకు కాలయాపన చేసుకుంటూ వచ్చారు. వీరికి హత్నూర మండల పరిధిలోని తుర్కల ఖానాపూర్ గ్రామ శివారులో సర్వేనెంబర్ 80లో 2 ఎకరాల 2గుంటతో పాటు మరో నాలుగు సర్వే నెంబర్లలో 30 గుంటల భూమి ఉంది. దీంతో పౌతి మార్పు కోసం బుజ్జి తహసీల్దార్‌ను ఆశ్రయించగా కుటుంబ వారసత్వ ధ్రువపత్రం పొందిన తర్వాత పౌతి మార్పు చేసుకోవాలని సూచించాడు. దీంతో ఆ మహిళ కోర్టు ద్వారా ధ్రువపత్రం పొందేందుకు దరఖాస్తు చేసుకుంది. అంతలోనే మాణిక్యం రెండో భార్య కుమార్తెలు ఇద్దరు కేవలం అఫిడవిట్ తీసుకువచ్చి తహసీల్దార్‌కు డబ్బులు ముట్టచెప్పడంతో ఎలాంటి విచారణ లేకుండానే పౌతి మార్పు చేసి భూమి పూర్తిగా ఆ ఇద్దరు కుమార్తెలపైకి మార్చినట్లు విషయం తెలుసుకున్న బుజ్జి తన ఇద్దరు పిల్లలతో వారం రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి నిలదీయడంతో తహసీల్దార్ నీళ్లు నమిలాడు. దీంతో తప్పుడు సమాచారంతో పౌతి మార్పు చేయించుకున్న ఆ మహిళలను పిలిచి మళ్లీ రిజిస్ట్రేషన్ చేయిస్తానని హామీ ఇవ్వడంతో వెనుతిరిగి వెళ్లారు. కానీ.. వారం రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా లెక్క చేయడం లేదని, తనకు న్యాయం చేయకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకుంటానని బుజ్జి వాపోయింది. ఈ విషయమై హత్నూర రెవెన్యూ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితురాలు బుజ్జి, ఆమె పిల్లలు

అమర జవాన్లకు నివాళి



అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న శివస్వాములు

జహీరాబాద్: పుల్వామా దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమర జవాన్లను స్మరిస్తూ జహీరాబాద్ పట్టణంలోని బీదర్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న అమరవీరుల స్తూపం వద్ద శివస్వాములు నివాళులర్పించారు. బీజేపీ నాయకుడు అశోక్‌పాటిల్, శివస్వాములు సురేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బండి వెంకట్, టిల్లు, ప్రవీణ్, శేఖర్, శ్రీనివాస్‌చారి, మహేష్, రాజు, శివాజీ, మహిపాల్‌రెడ్డి, సాయి, అనిల్ పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో మహేష్‌గౌడ్ ప్రతిభ

హత్నూర (సంగారెడ్డి): మండలంలోని సిరిపుర గ్రామానికి చెందిన సంగన్నగారి మహేష్ గౌడ్ కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ చూపుతున్నాడు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కిక్ బాక్సింగ్ ఇంటర్ నేషనల్ టోర్నమెంట్లో రెండు వెండి పథకాలు సాధించాడు. బుధవారం గ్రామానికి వచ్చిన మహేష్ గౌడ్ ను ఘనంగా స్వాగతం పలికారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

ఎంపీపీ జయశ్రీ

మనూరు(నారాయణఖేడ్): ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తేనే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని ఎంపీపీ కొంగరి జయశ్రీ అన్నారు. మనూరు ఎంపీడీఓ షాజిలోద్దీన్ బదిలీపై వెళ్లడంతో బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని తెలిపారు. కాగా కొందరు ఉద్యోగులు అందించిన సేవలను ప్రజలు, నాయకులు ఎన్నటికీ మరిచిపోరని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ షాజిలోద్దీన్‌ను పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎల్గోయి మాజీ సర్పంచ్ విఠల్‌రావు, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం వంశీ, ఏపీఓ షాహెద్ పాల్గొన్నారు.



షాజిలోద్దీన్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు

వైభవంగా శివపార్వతుల కల్యాణం

హత్నూర(సంగారెడ్డి): హమండలం సిరిపురం మాత మాణిక్యేశ్వరి ఓంకారేశ్వర ఆశ్రమం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన గోశాల ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

ఘనంగా వసంత పంచమి



సదాశివపేట: సత్యసాయి ఉన్నత పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



కంది: సరస్వతి ఆలయంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ దంపతులు

జిల్లావ్యాప్తంగా వసంత పంచమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ఆలయాల్లో చిన్నారుల చేత పూజారులు, తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు. సరస్వతిదేవి అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చింది. కంది మండల కేంద్రంలోని సరస్వతిదేవి ఆలయంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ దంపతులు ప్రత్యేక పూజలునిర్వహించారు.



నారాయణఖేడ్: సరస్వతి అవతారంలో లలితాంబికాదేవి అమ్మవారు



కోహీర్: చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

సంక్షిప్త వార్తలు

◆ రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన

పటాన్‌చెరు: వాహనాదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఎంవీఐ రాజామోహ్మద్ అన్నారు. బుధవారం రోడ్డు భద్రత మాసోత్సవాలు ముగిసిన సందర్భంగా ఇంద్రేశం గ్రామ శివారులోని రవాణాశాఖ కార్యాలయ నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీసీ కార్యాలయ ఎంవీఐ వెంకటేష్ రవాణా శాఖ సిబ్బంది, డ్రైవింగ్ స్కూల్ యజమానులు పాల్గొన్నారు.

◆ టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలి

పటాన్‌చెరు టౌన్: ఔటర్ రింగ్‌రోడ్ పై వెళ్లే వాహనదారులు ఎటువంటి సహాయం కావాలన్నా 14449 అనే టోల్ ఫ్రీ నెంబర్ కు సంప్రదించాలని ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు పటాన్‌చెరు ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్డు వద్ద కరపత్రాలను విడుదల చేసి టోల్ ప్లాజా ద్వారా వెళ్లే వాహనదారులకు పంపిణీ చేశారు.

◆ ప్లాస్టిక్‌ను వినియోగించొద్దని తీర్మానం

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని గౌటిగార్‌పల్లి గ్రామంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని తీర్మానించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు సమావేశమై నిర్ణయించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ వాడకంతో కలుగుతున్న అనర్థాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామస్తులు వివరించారు.

◆ తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా సంగారెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా సంగారెడ్డి బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

◆ గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశ వ్యాప్తంగా తలపెట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఆత్మకూర్, మద్దికుంట, తంగడపల్లి గ్రామాల్లో బుధవారం పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు ప్రవీణ్, యాదవరెడ్డి, ఆంజనేయులు, మల్లేశం, ఏసోబు, మహేష్, సంజీవ పాల్గొన్నారు.

◆ పటాన్‌చెరు ఎస్‌ఐలుగా వెంకటరెడ్డి, ఆసిఫ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐలుగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు, వెంకటరెడ్డి ఇద్దరు సదాశివపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో సదాశివపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐలుగా విధులు నిర్వహిస్తున్న వెంకటరెడ్డి, ఆసిఫ్‌అలీ బదిలీపై వచ్చి పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో వీరిద్దరూ బీడీఎల్, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లలో వివిధ హోదాల్లో పనిచేశారు.

◆ జహీరాబాద్ డీఎస్పీ బదిలీ

జహీరాబాద్: డీఎస్పీ రఘు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఆయనను ఇంటలీజెన్సీ డీఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సుభాష్‌రావు బదిలీ అయ్యారు. ఆయనను జీహెచ్‌ఎంసీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో సదాశివపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

◆ సన్మానం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన అరవింద్ రాథోడ్(సేడియా గుట్ట తండా) సంతోష్ (గౌసాబాద్), కిరణ్(సంగాపూర్), కిషోర్(ఉప్పర్‌పల్లి), సునీల్(పైడిగుమ్మల్), దిపేష్(మధులై), సునీల్(మిర్జంపల్లి), నిఖీత, మనోజ్, మోతీరాం, పరమేశ్వరి, మమత(విట్టునాయక్), కల్పన(సజ్జరావుపేట తండా)లు పోలీసు ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా వీరిని తెలంగాణ బంజార ఎంప్లాయీస్ సేవా సంఘం(టీబెస్) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. టీబెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్, నాయకులు అర్జున్, తుకారాం చవాన్, హన్మంత్ పవార్, రమేశ్ బాణోత్, దేవిసింగ్ రాథోడ్, సుభాష్, నానుసింగ్, జైసింగ్, పాండు తదితరులు పాల్గొన్నారు.